క్లుప్తంగా

వైభవంగా గౌరీవిశ్వేశ్వరస్వామి కల్యాణం



నగరంపాలెం: బ్రాడీపేట 2/7వ అడ్డరోడ్డులోని శ్రీగౌరీవిశ్వేశ్వర దేవాలయంలో స్వామి నామ నక్షత్రం సందర్భంగా శనివారం కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. సరస్వతుల గణేష్, కుమారి, వంక ఉమా మహేశ్వరరావు ఉమాదేవి, మామిళ్లపల్లి శివపూర్ణప్రసాద్, విజయలక్ష్మి, మన్నవ వెంకటేశ్వరరావు, కృష్ణకుమారి, పులిపాక లక్ష్మి దంపతులతో అర్చకులు విశ్వేశ్వరశర్మ కల్యాణాన్ని జరిపించారు. ఏర్పాట్లను దేవాలయ అర్చకులు జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్‌శర్మ, మల్లికార్జునశర్మ పర్యవేక్షించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకుని, కల్యాణాన్ని తిలకించారు.

16,17 తేదీల్లో వ్యవసాయ కార్మిక సంఘం వర్క్‌షాప్



లక్ష్మీపురం: వ్యవసాయ రంగానికి కార్మికులు పట్టుకొమ్మలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ అన్నారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో శనివారం రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం వర్క్‌షాప్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16,17 తేదీల్లో మల్లయ్య లింగం భవన్‌లో జరిగే వర్క్‌షాప్‌లో వ్యవసాయ కూలీలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాబోతు ఈశ్వరరావు మాట్లాడుతూ దేశంలోని ప్రజలందరికీ ఆహార ఉత్పత్తి అందించడంలో వ్యవసాయ కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తన్నీరు ప్రభుదాసు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభా ప్రదర్శనలతో నైపుణ్యాలకు పదును



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతిభా ప్రదర్శనలతో విద్యార్థుల్లో అంతర్గతంగా దాగిన సృజనాత్మక నైపుణ్యాలకు పదును పెట్టవచ్చునని నారాయణ ఇంగ్లిషు మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ లవీణ పేర్కొన్నారు. ఎస్వీఎన్ కాలనీలోని నారాయణ స్కూల్లో శనివారం ఈ-కిడ్స్ విభాగంలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంవత్సరం పొడవునా విద్యార్థులు పాఠ్యాంశాల్లో నేర్చుకున్న అంశాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ లవీణ మాట్లాడుతూ విద్యార్థి పురోగతి, సాధనలను తల్లిదండ్రుల ఎదుట ప్రదర్శించడమే కార్యక్రమ ముఖ్యోద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో రాధి, విజయ్‌బాబు, షమీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో ప్రహరీ ప్రారంభం



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో నూతనంగా నిర్మించిన ప్రహరీని శనివారం గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ప్రారంభించారు. అనంతరం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వైద్య కళాశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని అభినందించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎన్నికల కోడ్ వల్ల నిలిచిన పీజీఆర్ఎస్‌ని తిరిగి ప్రారంభిస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న నగర ప్రజల సమస్యల పరిష్కారానికి 9:30 నుంచి 10:30 గంటల వరకు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్ (0863-2224202) కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని ఆయన తెలిపారు.

పోరాటంతోనే హక్కుల సాధన



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల తదితరులు

లక్ష్మీపురం: డెన్మార్క్ రాజధాని కోపెన్‌హెగన్‌లో 1910లో బట్టల పరిశ్రమంలో పనిచేస్తున్న వేలాదిమంది మహిళలు ఎనిమిది గంటల పని దినం, వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, ఓటుహక్కు, మెరుగైన జీవితం కోసం దీర్ఘకాలిక పోరాటం చేసి సాధించుకున్న దినమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం అని రాష్ట్ర మహిళా సమాఖ్యా రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల తెలిపారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విమల మాట్లాడుతూ హక్కుల్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మహిళలందరిపై ఉందని తెలిపారు. స్వేచ్ఛ జీవితానికై పోరాడుదామని ఆమె పిలుపునిచ్చారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యల గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో హక్కుల పోరాటాలపై సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, ఐఏఎల్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జె.నరసింహారావు, డాక్టర్ బి.పుష్ప ప్రియాంక, అడ్వకేట్ ప్యానల్ గొనుపు శ్యామల, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, మహిళా సమాఖ్య నగర కార్యదర్శి గుండెబోయిన లక్ష్మి, సీపీఐ మంగళగిరి పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ తదితరులు ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అభ్యుదయ గేయాలు ఆకట్టుకున్నాయి.

మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా నగరంపాలెంలోని రెడ్ క్రాస్ భవన్‌లో శనివారం విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ రాష్ట్ర కోశాధికారి పి.రామచంద్రరాజు మాట్లాడుతూ గతంలో పాశ్చాత్య దేశాల కంటే మన దేశంలో లింగ వివక్షత ఎక్కువగా ఉండేదని తెలిపారు. ప్రస్తుతం పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో త్వరలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. రోటరీ క్లబ్ పూర్వ గవర్నర్ వడ్లమాని రాజ్యలక్ష్మి ప్రసంగిస్తూ మహిళలు భారతీయ కుటుంబ వ్యవస్థకు మూల స్తంభాలనీ, శక్తి స్వరూపిణిగా భావిస్తారని పేర్కొన్నారు. మహిళల సేవలను అన్ని రంగాల్లో విస్తృత పరచాలని సూచించారు. కార్యక్రమంలో యూత్ రెడ్ క్రాస్ జిల్లా కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి నరసింహారావు, తెనాలి రెడ్ క్రాస్ చైర్మన్ ముమ్మనేని భానుమతి పాల్గొన్నారు.

మహిళా సమానత్వంతోనే ప్రగతిశీల సమాజం

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళా సమానత్వంతోనే ప్రగతిశీల సమాజం ఏర్పడుతుందని మాజీ మంత్రి డొక్కా మాణిక్ వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం అరండల్‌పేటలోని ఓ హోటల్లో వీసీకే పార్టీ ఏపీ మహిళా విభాగ రాష్ట్ర అధ్యక్షురాలు కె.జయసుధ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కవి, జర్నలిస్టు బి.విల్సన్ అధ్యక్షతన జరిగిన సభలో మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో మహిళలపై చిన్న చూపు ఉండటం వల్ల వారిపై అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో మహిళలను గౌరవంగా చూడాలని, రాజకీయంగా, ఆర్థికంగా సమాన అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శారదానికేతన్ ఓరియంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ కోటిరత్నం, బహుజన డెమోక్రసీ కార్యదర్శి ప్రశాంతి, పి.కోటేశ్వరరావు, ఓర్చు ప్రేమ రాజు, ఏఎన్‌యూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కొండలరావు, చిరతనగండ్ల వాసు, రాయపూడి మరియదాసు, సుందర రాజు, ఈరి రాజశేఖర్, గంగోలు శామ్యూల్, మంచాల జోసెఫ్, జి.శ్రీనివాస్, డాక్టర్ ప్రసాదరావు పాల్గొన్నారు.

సమాజ పురోగతికి మహిళా సాధికారత మూలం

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజ పురోగతికి మహిళా సాధికారత మూలమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. శనివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మట్లాడుతూ మహిళల భాగస్వామ్యం లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళలు విద్యావంతులు కావడం ద్వారా సామాజిక మార్పు సాధ్యమని పేర్కొన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు ఏఎస్ కుసుమ కుమారి మాట్లాడుతూ మహిళలు కుటుంబ విషయాలకే పరిమితం కాకుండా సామాజిక సమస్యలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్, సహాధ్యక్షురాలు వై. నాగమణి, జిల్లా మహిళా కార్యదర్శులు ఎండీ షకీలా బేగం, కె.కామాక్షి, ఏఎల్ శివపార్వతి, రాష్ట్ర నాయకులు విజయ, కమల, శ్రీదేవి, ప్రజా సంఘాల నాయకులు పద్మ, అరుణ, అనురాధ పాల్గొన్నారు.

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు సత్కారం

లక్ష్మీపురం: మహిళల అభ్యున్నతి, వారి సమస్యల పరిష్కారం కోసం ఎన్నో సంవత్సరాలుగా అవగాహన సంస్థ చేస్తున్న కృషి అభినందనీయం అని సాహితీవేత్త సీహెచ్. సుశీలమ్మ అన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుశీలమ్మ మాట్లాడుతూ స్త్రీలపై జరిగే దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా ఆందోళనలు, సభలు నిర్వహించిన చరిత్ర అవగాహన సంస్థకు ఉందని తెలిపారు. అనంతరం పరుగుల రాణిగా పేరొందిన విజయను, విశిష్ట లైబ్రేరియన్‌గా ఎన్నో పురస్కారాలు పొందిన రచయిత్రులు విజయశ్రీ , పద్మావతి తదితరులను ఘనంగా సత్కరించారు.

దేశాభివృద్ధి మహిళలతోనే సాధ్యం

గుంటూరు లీగల్: జిల్లా కోర్టు ఆవరణలో శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా న్యాయవాదులు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధి మహిళలతోనే సాధ్యమని తెలిపారు. కుటుంబ వ్యవస్థ అభివృద్ధిలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. స్టేట్ లీగల్ సెల్ జనరల్ సెక్రటరీ పోలూరి వెంకటరెడ్డి, బార్ కౌన్సిల్ మెంబర్ వట్టి జొన్నల బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి ప్రతి ఒక్కరు చేయూతనిచ్చి వారికి అండగా నిలబడాలన్నారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొత్తగా విధు ల్లో చేరిన డిఫెన్స్ అసిస్టెంట్ చీఫ్ ఎస్.బి..ఏ.ఝూన్సీని సన్మానించారు. కార్యక్రమంలో న్యాయ వాదులు మంజుల, శ్యామల వెంకటరమణ, లలిత, స్నేహ, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు సీడీ భగవాన్, క్రాంతి, రాయపూడి శ్రీనివాసరావు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నగరంపాలెం: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పంచాయతీ రిసోర్స్ సెంటర్ సమన్వయకర్త పద్మ రాణి శీలా అన్నారు. ఆర్ఎస్ ఈవెంట్స్ వ్యవస్థాపక అధ్యక్షురాలు మునిపల్లె రమణిమూర్తి ఆధ్వర్యంలో శనివారం అమరావతిరోడ్డు అన్నదాన సమాజం ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. అఖిల భారత పంచాయితీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, విశ్రాంత ఏఓ వి.వెంకాయమ్మ, సేవాసదన్ అధ్యక్షులు మిరియాల గోపీకుమార్, మిరియాల ప్రసాదరావు, డేగల వెంకటేశ్వరరావు, శివప్రసాద్ మాట్లాడారు. అనంతరం పద్మరాణి, మునిపల్లె రమణి, వై.హేమమాలిని, శిరీషలను సత్కరించారు. గాయకులు మునిపల్లె రమణి, పత్రి లలిత్‌బాబు, వై.హేమమాలిని, ఎస్.శిరీష ఆలపించిన మధుర గీతాలు ప్రేక్షకులను అలరించాయి.

మహిళలు మరింత ఉన్నతి సాధించాలి

నగరంపాలెం: మహిళలు మరింత ఉన్నతి సాధించాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.రవికాంత్ అన్నారు. ఎన్టీఆర్ బస్టాండ్‌లోని తిక్కన సమావేశ మందిరంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లాలోని ఐదు డిపోల్లోని ఉత్తమ ఉద్యోగినులను సత్కరించారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సౌజన్య, మల్లీశ్వరి, పర్సనల్ అధికారి బి.పవన్, డిపోల మేనేజర్లు పాల్గొన్నారు.

విశిష్ట మహిళలకు సత్కారాలు

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గుళ్లపల్లి సబ్బారావు సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంస్థ తరఫున గుంటుపల్లి అరుణ కుమారి, సత్కార గ్రహీతలు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. డెబ్బై ఏళ్ల పైబడి వివిధ రంగాలలో నిష్ణాతులైన ఎ.భారతీదేవి (వీణ, సంగీతం), డాక్టర్ జి.వైదేహి (విద్య, ఆధ్యాత్మిక రంగం), డాక్టర్ జంధ్యాల కనకదుర్గ (రచయిత్రి, విద్యారంగం), ఎం.రాజ్యలక్ష్మి (క్రీడా రంగం), పత్రి నిర్మల (సంగీతం)లను సత్కరించారు. అనంతరం డాక్టర్ జంధ్యాల కనకదుర్గ రచించిన గత శతాబ్దపు సాహితీ స్రవంతి శతాబ్ది సూరీడు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని పెద్ది సాంబశివరావు పర్యవేక్షించగా, కుందుర్తి స్వరాజ్య పద్మజ అధ్యక్షత వహించారు. ప్రొఫెసర్ పరుచూరి విజయలక్ష్మి సభను నిర్వహించారు.చిన్నారి శ్యాన్వి నృత్య ప్రదర్శన అలరించింది.కార్యక్రమంలో గుళ్లపల్లి స్వాతి, గుళ్ళపల్లి రాఘవరావు పాల్గొన్నారు,

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

నగరంపాలెం: నేడు అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తున్నారని విశ్రాంత ఐజీ వెంకట్రామిరెడ్డి తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని సత్య ఇన్వెస్టిగేషన్ అండ్ సెక్యూరిటీస్ సర్వీసెస్ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కొన్ని రంగాలకే మహిళలు పరిమితమయ్యారని, ప్రస్తుతం అంతరిక్షంలో కూడా భాగస్వాములుగా మారారని కొనియాడారు. అనంతరం సర్వీసెస్‌లో పనిచేసే మహిళా ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో సర్వీసెస్ ఎండీ కాళహస్తి సత్యనారాయణ, సాయి పాల్గొన్నారు.

మాతృమూర్తి స్ఫూర్తితో రాణించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతి మహిళా జన్మనిచ్చిన మాతృమూర్తిని స్ఫూర్తిగా తీసుకుని అన్ని రంగాల్లో రాణించాలని జేకేసీ కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మహిళా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె. సాంబశివరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, మహిళా సాధికార సమితి ఉపాధ్యక్షురాలు పి. నాగ సుశీల పాల్గొన్నారు.

మహిళలు స్ఫూర్తి ప్రదాతలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నత రంగాల్లో రాణిస్తున్న మహిళలు మిగిలిన వారికి స్ఫూర్తి ప్రదాతలుగా నిలుస్తున్నారని జీకేఆర్ హైస్కూల్ ప్రిన్సిపాల్స్ జి. శైలజ, జి. సుశీల పేర్కొన్నారు. శనివారం జీకేఆర్ హైస్కూల్ పట్టాభిపురం, ఏటీ అగ్రహారం క్యాంపస్‌లలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినులకు వైవిధ్యమైన కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు కేక్ కట్ చేశారు. భారతదేశ ప్రథమ మహిళ అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మహిళలకు ఆదర్శనీయురాలని, ఆమెను స్ఫూర్తిగా తీసుకుని అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు జి. కొండారెడ్డి, జి.జనార్దన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నారీ శక్తికి అద్దం పట్టే మహిళా దినోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: నారీశక్తికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం అద్దం పడుతుందని సుమేధ హైస్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో శనివారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ వివిధ రంగాల్లో మహిళలు సాధించిన కృషి, విజయాలను గుర్తించేందుకు మహిళా దినోత్సవం ప్రత్యేక వేదికగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయినులతో చంద్రశేఖర్‌రెడ్డి

నేడు అన్ని రంగాల్లో మహిళలు ముందంజ

ఎమ్మెల్యే మాధవి

లక్ష్మీపురం: నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు హాజీ షేక్ లాల్ వజీర్, లాఫింగ్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ మహిళ లేనిదే ఈ భూ ప్రపంచం లేదని తెలిపారు. ఆమె తలచుకుంటే సాధించలేని పని అంటూ ఏదీ లేదని స్పష్టం చేశారు. నియోజకవర్గ పరిధిలో మహళలపై అసభ్యకరంగా ప్రవర్తించినా, ఈవ్ టీజింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రంజాన్ పండుగను పురస్కరించుకుని కోబాల్ట్‌పేట, దేవాపురం ప్రాంత ముస్లిం మహిళలకు లాఫింగ్ క్లబ్ లాల్ వజీర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తోఫాను అందజేశారు. కార్యక్రమంలో ధర్మకిషోరి, లక్ష్మి, ప్రసన్న, సంధ్య, రామారావు, శ్రీనివాస్, విజయలక్ష్మి, మలేశ్వరి, రత్నం పాల్గొన్నారు



రంజాన్ తోఫాను అందజేస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

సామాజిక మాధ్యమాలతో మహిళలు, బాలికలు బలి



మాట్లాడుతున్న స్త్రీ విముక్త సంఘటన రాష్ట్ర నాయకురాలు శ్రీదేవి

గుంటూరు ఎడ్యుకేషన్: సినిమాలు, వెబ్ సిరీస్‌లతో పాటు ఇతర సామాజిక మాధ్యమాల ప్రభావంతో మహిళలు, బాలికలు బలవుతున్నారని న్యాయవాది, స్త్రీ విముక్త సంఘటన రాష్ట్ర నాయకురాలు టి.శ్రీదేవి అన్నారు. ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం కొరిటెపాడులోని రంగాచార్య ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో స్త్రీ పాత్ర ప్రముఖమైనదని తెలిపారు.పనిచేసే ప్రతిచోటా మహిళ దోపిడీకి గురవుతోందని, ఇందుకు కారణం మొదటి నుంచి ఆమెను రెండో ప్రాధాన్యత కలిగిన వ్యక్తిగా చూడటమేనని వివరించారు. ఈ జాడ్యం పోవాలంటే మహిళ విద్య ద్వారా సాధికారత సాధించాలని ఆమె తెలిపారు. ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షురాలు పి.పార్వతి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చంద్ బాషా, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, జిల్లా కౌన్సిలర్లు సరస్వతి, జిల్లా శాఖ అధ్యక్షుడు కె.బసవలింగారావు, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లా శాఖ నాయకులు మూర్తి, దాస్,శివన్నారాయణ, వెంకటేశ్వర్లు, శివరామకృష్ణ, బాలరాజు, చంద్రిక, రమాదేవి పాల్గొన్నారు. కార్యక్రమ అనంతరం ఉపాధ్యాయిలను ఘనంగా సన్మానించారు.



ఆర్టీసీలో ఉద్యోగినులకు సత్కారం



సత్కారం పొందిన విశిష్ట మహిళలు



ఉపాధ్యాయినులతో ప్రిన్సిపాల్ సుశీల



సత్య సెక్యూరిటీస్ సర్వీసెస్‌లో ఉద్యోగినికి సత్కారం



సిబ్బందితో గోపీచంద్, సాంబశివరావు, ఎస్సార్కే ప్రసాద్, నాగసుశీల



సైకిళ్ల పంపిణీలో పాల్గొన్న రామచంద్రరాజు, రాజ్యలక్ష్మి, లక్ష్మీనారాయణ తదితరులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



విశిష్ట సేవలు అందించిన మహిళలను సత్కరిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు



డిఫెన్స్ అసిస్టెంట్ చీఫ్ ఝాన్సీని సన్మానిస్తున్న న్యాయవాదులు



అన్నదాన సమాజం ఆడిటోరియంలో మహిళలకు సత్కారం

అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట



సదస్సులో మాట్లాడుతున్న తులసి యోగీష్

కొరిటిపాడు: అప్రమత్తతతో రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని తులసి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ చంద్ర తెలిపారు. తులసి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, లఘు ఉద్యోగ్ భారతి ఆధ్వర్యంలో నల్లపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో విద్యార్థులకు జాతీయ భద్రత వారోత్సవంలో భాగంగా ప్రమాద నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి యోగీష్ చంద్ర ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. రోడ్లపై ఇసుక, కంకర, గ్రావెల్ లాంటివి పోసినప్పుడు ద్విచక్ర వాహనాలు స్కిడ్ అయి, ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని సూచించారు. ఇళ్లల్లో ఫ్లోర్‌పై నీరు పడితే జాగ్రత్త వహించాలని, లేనిపక్షంలో జారిపడి కాళ్లు, చేతులు విరిగే ప్రమాదముందని తెలిపారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో లఘు ఉద్యోగ్ భారతి జనరల్ సెక్రటరీ గుంటూరు డివిజన్ సీహెచ్.శ్రీధర్, హైస్కూల్ హెచ్ఎం జ్ఞాన ప్రసూన, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని మృతదేహం



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం నంబర్-1లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వయస్సు 45 సంవత్సరాల దాకా ఉండొచ్చు. సహజ మరణం చెందినట్లు రైల్వే జీఆర్పీ పోలీసులు భావిస్తున్నారు. గుర్తు తెలియని మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు జీఆర్పీ సీఐ అంజిబాబు (9440627546), ఎస్ఐ దీపిక (9121715242), జీఆర్పీ పోలీస్ స్టేషన్ (0863-2220753) నంబర్లకు సమాచారం తెలియజేయాలని కోరారు.

వైభవంగా ధాన్యలక్ష్మి కల్యాణం



నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట 4/2వ అడ్డ రోడ్డులోని శ్రీ అష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో 30వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం గణపతి పూజ, గోపూజ, శ్రీచక్ర మేరుకు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. శ్రీ ధాన్యలక్ష్మి అమ్మవారి కల్యాణం కనుల పండువగా జరిగింది. ధాన్య సమృద్ధి, రైతన్నలు సుభిక్షంగా ఉండాలని ఈ విశేష కల్యాణం నిర్వహించారు. మహాహారతి, మంత్రపుష్పం అనంతరం కల్యాణంలో పాల్గొన్న దంపతులకు, భక్తులకు తీర్థ, అన్న ప్రసాదాల వితరణ చేశారు. కార్యక్రమాలను ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్‌శర్మ , ధర్మకర్త మర్రిపాటి పార్థసారథి పర్యవేక్షించారు.